ఇందిరమ్మ సర్వే ప్రారంభం


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్ పర్సన్ పుష్పలత

- అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

జడ్చర్ల టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు, 17మండలాల్లోనూ మంగళవారం సర్వే ప్రారంభం కాగా సర్వర్ సమస్య తలెత్తింది. గురువారం నుంచి పూర్తి స్థాయిలో సర్వే చేపడుతామని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫిబ్రవరిలో ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు అర్జీలు పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన ఇటీవలే ముగిసింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం అర్హుల లబ్ధిదారుల ఎంపిక చేసే ప్రక్రియను ప్రారంభించారు.

2,09,514 దరఖాస్తులు..

జిల్లాలోని జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలతోపాటు 17మండలాల్లో మొత్తం ప్రజాపాలనలో 2,09,514 దరఖాస్తులు అందాయి. వాటిలో మొదటిరోజున 381 దరఖాస్తులు సర్వే పూర్తిచేయగా 60 దరఖాస్తులు సగం సర్వే పూర్తిచేశారు. 321 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చారు. ఇళ్లకోసం అర్జీ పెట్టుకున్న వారి స్థితిగతులను తెలుసుకునేందుకు పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు ఇంటింటికి తిరుగుతున్నారు. సర్వర్ సమస్య, సిబ్బంది అవగాహన లేమి కారణంగా కాస్త ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

పలు అంశాలపై ఆరా

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటికోసం స్థలం ఉందా.. లేదా అన్న అంశం ఆరా తీస్తున్నారు. వారు నివాసముంటున్న ఇళ్లు అద్దెదా, స్వంతమా అని విచారిస్తున్నారు. స్థలం ఉంటే ఎక్కడుంది అన్న వివరాలు తెలుసుకుని నమోదు చేస్తున్నారు. దీంతోపాటు వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకుంటున్నారు. పూరిగుడిసెలు, అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

⇨ జడ్చర్ల మండంలోని మల్లెబోయిన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

⇨ హన్వాడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం పంచాయతీ కార్యదర్శి దీపిక సర్వే చేసి వివరాలను యాప్‌లో నమోదు చేశారు.

> **27 వార్డుల్లోనూ సర్వే ప్రారంభం**
>
> మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డుల్లోనూ వార్డు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 9,300 దరఖాస్తులు ప్రజాపాలనలో అందాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. సర్వేకు గడువు లేకపోయినప్పటికీ 20 రోజుల్లో పూర్తిచేసేలా ప్రయత్నిస్తాం.
>
> – లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

అర్హులను గుర్తించండి : కలెక్టర్

భూత్పూర్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం బుధవారం మండలంలోని కొత్తమొల్గరలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు కార్యదర్శులు చేపడుతున్న ఇంటింటి సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సూచించిన ప్రతి అంశాన్ని ఎలాంటి లోపాలు లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ భాస్కర్, ఎంపీడీఓ శ్రీదేవి ఉన్నారు.


కొత్త మొల్గరలో గ్రామ కార్యదర్శితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

క్లుప్తంగా

పెండింగ్ చలాన్లు చెల్లించాలి



భూత్పూర్ : వాహనదారులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు వెంటనే చెల్లించాలని మహబూబ్‌నగర్ ఎస్‌ఐ శివయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని చౌరస్తాలో వివిధప్రాంతాల నుంచి వచ్చే కార్లు, బైక్‌లను తనిఖీ చేశారు. వాహనాల నంబరును తనిఖీ చేసి పెండింగ్ చలాన్ ఉన్న డబ్బులను ఆన్‌లైన్‌లో రికవరీ చేశారు. ఒక్కో వాహనం నుంచి రూ.200 నుంచి రూ.2వేల వరకు ఉన్న పెండింగ్ చలాన్లు వసూలు చేశారు.హెడ్ కానిస్టేబుల్ మొగిల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కంఠస్థ పోటీలకు విశేష స్పందన



నవాబుపేట: భగవద్గీత కంఠస్థ పోటీలకు విశేష స్పందన లభించింది. బుధవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈఓ నాగ్యానాయక్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 326 మంది విద్యార్థులు హాజరై భగవద్గీత పారాయణం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం నాయక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు యాదయ్య, రవిశంకర్, విజయ్, సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హోమాలు, ప్రత్యేక పూజలు



నవాబుపేట: మండలంలోని కారుకొండ గ్రామంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయ పునర్నిర్మాణం కోసం బుధవారం గ్రామంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రాల మధ్య గ్రామస్థులు సామూహిక హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కారుకొండ గ్రామస్థులు పురుషోత్తం, బంగ్లారవి, వెంకటేష్, రాజ్‌కుమార్, గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

బోర్లు ప్రారంభం

జడ్చర్ల టౌన్: బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్, హనుమాన్‌స్ట్రీట్‌లో రెండు రోజుల క్రితం బోర్లు వేశారు. బుధవారం ఆ బోర్లకు చేతిపంపులు బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్, బాలవికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కత్తెరపురుగును నివారిస్తే అధిక దిగబడులు



జడ్చర్ల: మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారిస్తే అధిక దిగుబడులు వస్తాయని భారతీయ వ్యవసాయ పరిశోధనసంస్థ, మొక్కజొన్న పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, డాక్టర్ నాగేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కోడ్గల్ గ్రామంలో వారు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగు నివారణ చర్యలు రైతులకు వివరించారు. వారి వెంట జిల్లా, మండల వ్యవసాయాధికారులు వెంకటేశ్వర్లు, గోపినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, జంగయ్య, సాయిరెడ్డి ఉన్నారు.

ఏబీసీడీ వర్గీకరించాలి

దేవరకద్ర: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మాదిగలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొబ్బలి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం కౌకుంట్ల మండలం వెంకటగిరిలో జనవరి 19 న జరిగే మాదిగల మహాగర్జన కరపత్రాలను విడుదల చేశారు. మాదిగల ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు రాజు, విజయప్రతాప్, బాల్‌రాజు, సంగప్ప, జగన్నాథ్,శ్రీను, వెంకటేశ్, గోపాల్, జగన్, పెంటన్న, బుచ్చన్న, రామకృష్ణ, బాలు పాల్గొన్నారు.

ఖోఖోలో వేపూర్ విద్యార్థుల ప్రతిభ

సాక్షి నెట్‌వర్క్: హన్వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన సీఎం కప్ ఖోఖో పోటీల్లో వేపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచి ప్రతిభ చాటారు. గొండ్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

⇨ జడ్చర్ల బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి సీఎం కప్– 24 క్రీడలు ముగిశాయి. క్రీడలను మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో సీఐ ఆదిరెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ పుష్పలత, రాష్ట్ర పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్, పీడీలు, పీఈటీలు, నాయకులు పాల్గొన్నారు.

⇨ రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఎంపీడీఓ మశ్చందర్ తెలిపారు. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఎంఈఓ సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రావ్, నాయకులు యాదయ్య, కృష్ణయ్య, నరహరి, రమేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.


హన్వాడలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

⇨ గండేడ్ మండలంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. వెన్నాచేడ్, సల్కర్‌పేట్, బల్సూర్‌గొండ, గండేడ్, కొంరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు.

⇨ దేవరకద్ర మండలంలో సీఎం కప్‌లో భాగంగా ఖోఖో పోటీలు జోరుగా సాగాయి. బాలికల జట్టు, బాలుర జట్టు వేర్వేరుగా పోటీపడ్డారు. ఎంఈఓ బలరాం క్రీడలను పర్యవేక్షించారు.

⇨ కోయిల్‌కొండ మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో సీఎం కప్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాశప్ప బహుమతులు ప్రదానం చేశారు. పీఈటీ మొగులాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన తల్లిదండ్రులైన శాంతానారాయణగౌడ్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. ఆట్రస్టుపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రపంచంలో లేని ఎంతో పెద్దవింతను కనుగొన్నట్లు భ్రమ పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కాజేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా వేల కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వర్ధభాస్కర్, కిషన్‌పవర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

జర్నలిస్టులపై దాడి సరికాదు



జడ్చర్ల: జర్నలిస్టులపై నటుడు మోహన్‌బాబు దాడి చేయటం సమంజసం కాదని జర్నలిస్టుల సంఘం ఐజేయూ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలో సిగ్నల్‌గడ్డ వద్ద నిరసన తెలిపారు. జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ ఆదిరెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు నరేందర్‌గౌడ్, శశికాంత్, శ్రీధర్, రవీందర్, డేవిడ్, అమీర్, మల్లేష్, శేఖర్, జైపాల్, హైదర్‌ఆలీ, కిరణ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వడ్డెర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి(వీఆర్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి వల్లెపు శేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మెకు టీపీఆర్టీయూ మద్దతు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు టీ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు మద్దతు తెలిపారు. బుధవారం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు శ్రీనివాస్‌లు, యాదగిరి, ఖాజామైనోద్దీన్, ఇక్రం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య కోరారు. సర్వ శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడం బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డి ఎన్నికపై హర్షం

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏపీ జితేందర్‌రెడ్డి ఎన్నికపై ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ.వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, జిల్లా జూడో, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామలక్ష్మణ్ బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఖాజాఖాన్ ఎన్నిక కావడంపై నెట్‌బాల్ సంఘం ప్రతినిధులు ఆనందం తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



దేవరకద్ర: ఉపాధ్యాయుల సమస్యలపై డిసెంబర్ 17న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున మహా ధర్నాకు హాజరుకావాలని కోరారు. తపస్ జిల్లా కార్యదర్శి బాబునాయుడు, కోశాధికారి రాజమోహన్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్ గౌడ్, హెచ్‌ఎంలు నాగేంద్రమ్మ, ఖాజామైనోద్దీన్, పవన్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి ఉత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో బుధవారం గీతాజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అష్టాదశశ్లోక పఠనం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాటక కళారంగ కోవిదుడు దుప్పల్లి శ్రీరాములు గీతా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల అధ్యక్షురాలు చిగుళ్లపల్లి పద్మలీల, సభ్యులు కనకప్ప, కృష్ణమూర్తి, రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఆచార్యబృందం పాల్గొన్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషాధారణతో ఆకట్టుకున్నారు.

అయ్యప్ప మాలధారుల ప్రత్యేకపూజలు

మహమ్మదాబాద్: స్థానిక అయ్యప్ప కొండపై బుధవారం అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప 18మెట్ల మహాపడిని కాంతిమల శిఖరంపై వెలిగించారు. ఈసందర్భంగా గురుస్వామి రాజు మాట్లాడారు. అయ్యప్ప స్వామి సన్నిధానంలో భగవద్గీత పుట్టినరోజు జరుపుకోవడం మహాభాగ్యమన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు గోపాల్, పెంట్యానాయక్, చెన్నయ్య, బాల్‌రాజ్, గోవర్ధన్, శ్రీను, చెందు, నర్సింహులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

- కలెక్టర్ విజయేందిర బోయి
- మధ్యాహ్నం భోజనం మాడిపోయి ఉండటంపై ఆగ్రహం

జడ్చర్ల టౌన్: విద్యార్థులకు అందించే భోజనం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. బుధవారం మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా మాడిపోయి ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటగది, స్టోర్‌రూంలను ఆమె పరిశీలించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆమె విద్యార్థులతో కలసి భోజనం చేశారు. వారితో మాట్లాడి జనం చేశారు. వారితో మాట్లాడి మధ్యాహ్నం భోజనం, బోధనపై ఆరా తీశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

చిన్నచింతకుంట: విద్యార్థులకు ప్రతి రోజు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ), ఎస్సీ, బీసీ హాస్టల్, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంట గది పరిసరాలు, మంచినీటి వసతులు తదితర వాటిని పరిశీలించారు.


కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. సిబ్బంది విద్యార్థుల పట్ల అలసత్వం వహించ రాదన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతిరోజు పాఠశాలలను, హాస్టళ్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా కేంద్రం మోమిన్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం హెచ్‌ఎం మిర్జా ఫైజుల్లా బేగ్ అన్నారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవలే జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఆయేషా బేగం, హఫ్సా బేగం కటాస్ విభాగంలో మెరుగైన ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ చైర్‌పర్సన్ సైరా బేగం, ఉపాధ్యాయులు ఖయ్యుం, మహ్మదీ బేగం, షీల, పీఈటీ ఎండి.రహెమత్, కరాటే మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ పాల్గొన్నారు.


విద్యార్థినులను సన్మానించిన హెచ్‌ఎం

ప్రారంభమైన సీసీరోడ్డు నిర్మాణ పనులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి హయాంలో మంజూరైన నిధులతో ఈపనులు చేపడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణపనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మాజీ మంత్రి అధికార దుర్వినియోగం

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగం చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అప్పట్లో అధికారాన్ని వాడుకొని అన్యాయంగా, అక్రమంగా ఏనుగొండ ప్రాంతంలోని బైపాస్ రోడ్డుకు సమీపంలో శాంతానారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్‌కు భూమిని కేటాయింపులు చేసుకున్నారని విమర్శించారు. ఎకరాల భూమి కేటాయింపులు చేసుకోవడమేకాకుండా రూ.1.20కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్నారు. మీ కుటుంబ సభ్యులు నడుపుతున్న ట్రస్టుకు భూమిని కేటాయించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 24 గంటల్లో మాజీ మంత్రి ఎంత భూమిని కేటాయింపు చేసుకున్నారో, ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో నిజనిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కలెక్టర్ విచారణ జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలంటూ ఉదయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు బుధవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి విన్నవించారు. డబుల్ ఇళ్ల పంపిణీలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ప్రకారం దాదాపు 150 ఇళ్లు రావాల్సి ఉందన్నారు. గతంలో కొంతమందికి ఇచ్చారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మరో 100ఇళ్లు దివ్యాంగులకు కేటాయిస్తే న్యాయం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

తేజస్వినికి సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్‌తండాకు చెందిన తేజస్విని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కాగా బుధవారం ఆమెను కోడూర్ మాజీ సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తేజస్విని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

క్రీస్తు మార్గంలో నడవాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని కల్వరి ఎంబీ చర్చి చైర్మన్, పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్‌కాలనీలో గల ఎంబీ ప్రార్థనా మందిరంలో వుమెన్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేశారు.రత్నకుమారి, ఎస్తెరు కృపానందం, విజయ సుదర్శన్, మంజుల భాస్కర్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి జిల్లా సంక్షేమ శాఖాధికారి జరీనాబేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేలు జీతం ఇవ్వడంతో పాటు పర్మినెంట్ చేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేయాలంటూ గురువారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, నాయకులు జహంగీర్, కుర్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీలకు సర్పంచ్ స్థానం కేటాయించాలంటూ దీక్ష

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలంటూ బుధవారం భూత్పూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్రామస్తులు దీక్ష చేపట్టారు. సర్పంచ్‌గా కొన్ని పర్యాయాలుగా వేరే కులాలకు కేటాయించారని, ఈసారి ఎస్సీలకు ఇవ్వాలని గ్రామానికి యాదయ్య కోరారు. ఈదీక్షలో బాల్‌చంద్రయ్య, బీమయ్య, ఆంజనేయులు, చిన్న భీమయ్య, వీరస్వామి, నరేందర్, శివ, జి.నాగయ్య, మహిళలు పాల్గొన్నారు.

